క్లుప్తంగా

పోలింగ్‌కు సర్వం సిద్ధం



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసన్నకుమార్

సీతానగరం: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించనున్న ఎంఎల్సీ ఉపాధ్యాయుల నియోజకవర్గం పీఎస్ 47వ పోలింగ్ కేంద్రంలో పోలింగ్‌కు సిద్ధం చేశామని సహాయ ఎన్నికల అన్నికల అధికారి ప్రసన్నకుమార్ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో భారీ బందోబస్తు మధ్య పోలింగ్ నిర్వహించడానికి పీఓలు, ఏపీఓలు, ఓటింగ్ మెటీరియల్ సిద్ధం చేశామని తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందని, ఓటు హక్కు గల వారంతా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై ఎం.రాజేష్, ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, ఎన్నికల అధికార సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్



పోలింగ్‌కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సాలూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనుంది. సాలూరు పట్టణం, మండలం నుంచి 250 మంది ఉపాధ్యాయులు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో (పోలింగ్ బూత్ నెంబరు 50) తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తహసీల్దార్ ఎన్వీ రమణ తెలిపారు. పోలింగ్ కేంద్రంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

నేడు దుగ్గేరులో వైద్యశిబిరం

మక్కువ: మండలంలోని దుగ్గేరు గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై వెంకటరమణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దుగ్గేరులో వారపుసంత జరుగునుండడంతో, గిరిజనుల సౌకర్యార్థం పోలీసుల ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించనున్నామని చెప్పారు. ప్రముఖ వైద్యాధికారులతో వైద్యసేవలు అందించడంతోపాటు, ఉచితంగా మందులు అందించనున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేయనున్నామన్నారు.

అన్న సమారాధన



అన్నదాన కార్యక్రమంలో పార్వతీపురం ఎంపీపీ మజ్జి శోభారాణి

పార్వతీపురం రూరల్: మండలంలోని సుడిగాం గ్రామంలో గల శివాలయం వద్ద మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం భక్తులకు పార్వతీపురం ఎంపీపీ మజ్జి శోభారాణి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, దేవాలయానికి వచ్చిన భక్తులకు స్థానిక గ్రామస్తులతో కలిసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రజలు పరమశివుని ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆమెతోపాటు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మజ్జిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భామిని: భామినిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో వచ్చే విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 24న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. వివరాలకు 94403 22964 నంబరుకు సంప్రదించాలని కోరారు.

జిల్లా కేంద్రానికి ఆర్టీసీ సర్వీసులు నడపాలి

భామిని: భామిని మండలం నుంచి పార్వతీపురం జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ఆర్టీసీ తగినన్ని సర్వీసులు నడపాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, బత్తిలి సొసైటీ చైర్మన్ బోడెపు రఘుపతినాయుడు కోరారు. జిల్లా అధికారులను కలిసేందుకు పార్వతీపురం వెళ్లాలంటే ఆర్టీసీ సర్వీసులు తగినన్ని ఉండాలన్నారు. భామిని, బత్తిలి, గుమ్మలక్ష్మీపురం, కురుపాం మీదుగా పార్వతీపురం నిత్యం రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఆర్టీసీ అధికారులు బస్సులు నడపాలని కోరారు. చివరకు సీతంపేట మండలానికి కూడా రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.



పార్వతీపురం రూరల్: పెదబొండపల్లిలో శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం



పార్వతీపురం రూరల్: అడ్డాపుశీలలో కాశీవిశ్వేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



సీతానగరం: సువర్ణముఖేశ్వరస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో దీపారాధనలో పాల్గొన్న భక్తులు



సాలూరు: శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర దంపతులు

అర్ధనారీశ్వరా..నమోనమః



సాలూరు: పంచముఖేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న అభిషేకాలు



సీతానగరం: లచ్చయ్యపేట శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పార్వతీపురం టౌన్: అగ్రహారం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సీతానగరం: భక్తులతో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో అభిషేకాలు చేయిస్తున్న నిర్వాహకులు

- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- తెల్లవారు జాము నుంచే పోటెత్తిన భక్తులు
- జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి పూజలు

పార్వతీపురంటౌన్:

హర..హర మహాదేవ శంభో శంకర..అంటూ జిల్లాలోని శైవక్షేత్రాలు మార్మోగాయి. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణంలోని శివాలయాల్లో భక్తులు శివయ్యకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయ కమిటీలు శివపార్వతుల కల్యాణం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాయి. పట్టణంలోని సాయి గార్డెన్స్‌లో ఉన్న పశుపతినాథ్ బ్రహ్మసూత్ర శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అగ్రహారంలో ఉన్న అతి పురాతన దేవాలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బలిజిపేట: గలావల్లి శివాలయంలో స్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు



సాలూరు: బ్రహ్మకుమారి సెంటర్‌లో శివజయంతి ఉత్సవాలు

శివాలయాలు కిటకిట

బలిజిపేట: మహా శివరాత్రి ఉత్సవంలో భాగంగా బుధవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మంగళవారం అర్ధరాత్రి 12గంటలు దాటింది మొదలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రసిద్ధి చెందిన నారాయణపురం చాతుర్లింగేశ్వర ఆలయం, గలావల్లి, వెంగాపురం, బర్లి, బలిజిపేట, పలగర, మిర్తివలస తదితర గ్రామాలలోని ఆలయాలకు తెల్లవారు జామునుంచే భక్తులు పోటెత్తారు. ఆలయప్రాంగణంలో కొంత మంది భక్తులు ప్రసాదాలను పంపిణీ చేశారు. అర్చకులు పూజా కార్యక్రమాలు జరిపించారు.

అంతటా శివనామస్మరణ

సీతానగరం: మహాశిరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం శివాలయాలన్నీ భక్తుల శివనామస్మరణంతో మార్మోగాయి. మండలకేంద్రంలోని పంచముఖేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 5 గంటలనుంచి కిలోమీటర్ దూరంలో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో వేచి ఉన్నారు. అలాగే లచ్చయ్యపేట శివా లయం, బూర్జ ఎండల మల్లికార్జునేశ్వరస్వామి శివాలయం, గాదెలవలస శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే మరిపివలస, కాశీపేట, కేఎస్ పురం, నిడగల్లులో నీలకంఠేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో బారులు తీరారు. ఆయా ఆలయాల్లోని అర్చకులు భక్తులతో అభిషేకాలు, రుద్రాభిషేకాలు చేయించారు.



సాలూరు: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబలకు పూజలు చేస్తున్న భక్తులు



సాలూరు: పారమ్మకొండపైకి వెళ్తున్న భక్తులు



మక్కువ: భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



మక్కువ: ఎరసామంతవలస శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సీతానగరం: పంచముఖేశ్వరస్వామి ఆలయం వద్ద క్యూలో భక్తులు

జెడ్పీ మాజీ చైర్మన్ వాకాడకు పరామర్శ



జెడ్పీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావుతో మట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతానగరం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జెడ్పీమాజీ చైర్మన్ వాకాడ నాగేశ్వరరావును వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు బుధవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై విశాఖ ఆస్పత్రిలో నాగేశ్వరరావు వైద్యం పొందారు. ఆయన ఆరోగ్యం కుదుటపడడంతో స్వగ్రామం బూర్జకు వచ్చారు.ఈ సందర్భంగా ఆయనను కలిసిన వారంతా యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వాకాడ నాగేశ్వరరావును పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బలగ శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ జిల్లా కార్యదర్శి బంకురు శంకరరావు, బి. ముకుందరావు, అంటిపేట ఎంపీటీసీ ఎస్.తిరుపతిరావు, గాదెలవలస సర్పంచ్ బి.తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

నేడు మావుడి ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మక్కువ: మక్కువ సబ్‌స్టేషన్ పరిధి మావుడి గ్రామంలో 33/11 ఎస్ఎస్, మావుడి, 11 కేవీ చింతలవలస ఫీడర్లపై ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. ఈ మేరకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ కె.గోపాలరావు నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే ఉదయం 4గంటల నుంచి 10 గంటల వరకు త్రీఫేస్ సప్లై ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యశిబిరం


పార్వతీపురంటౌన్:

మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యశిబిరం బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ హేమాక్షి శిబిరంలో ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. జీర్ణకోశ సంబంధిత సమస్యలు, కీళ్ల నొప్పులు, పలు దీర్ఘకాలిక సమస్యలకు మందులు అందజేశారు. ఆయుర్వేద వైద్యంలో ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుందని తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు డా.రామ్ ప్రసాద్, సాహు, డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హేమాక్షి

మద్యం తాగి వాహనం నడిపితే
భారీ మూల్యం



పార్వతీపురం రూరల్: మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం. మద్యం మత్తులో వాహనాలు నడిపే సమయంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి, ఆల్కహాల్ ప్రభావంతో మెదడుపై నియంత్రణ కోల్పోయి వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగి ఎందరో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి, ఎదుటి వారిని కూడా ఢీకొనే అవకాశం ఉంటుంది. దీంతో ఎదుటి వ్యక్తులు వారి ప్రమేయం లేకుండానే ప్రమాదాలకు గురై గాయపడడం, ప్రాణాలు కోల్పోవడం జరుగుతోంది. వాహనదారులకు పోలీసులు పలుమార్లు ప్రధాన కూడళ్ల వద్ద అవగాహన కల్పిస్తున్నప్పటికీ మందుబాబుల తీరు మారకపోవడంతో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో పార్వతీపురం పట్టణ పోలీస్ శాఖ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పటిష్టంగా చర్యలు అమలు చేసేందుకు రంగంలోకి దిగింది. ప్రమాదాలను అరికట్టడం కోసం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నారు. బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరిశీలించి, మీటర్‌లో రీడింగ్ జీరో దాటి చూపితే పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరుస్తారు. న్యాయస్థానాల్లో విచారణ చేసి రూ.10 వేల వరకు జరిమానా విధించవచ్చు. ఒక్కో సందర్భంలో జైలుశిక్ష కూడా పడవచ్చు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో నలభై మంది యువత మద్యం తాగి పట్టుబడిగా అవగాహన కల్పించి పోలీసులు విడిచిపెట్టారు. మరోసారి నిర్వహించిన తనిఖీల్లో రెండోసారి మద్యం తాగి వాహనం నడిపి పట్టుబడిన ఐదుగురు వ్యక్తులకు భారీస్థాయిలో జరిమానాను కోర్టు ద్వారా విధించారు.

పట్టుబడితే రూ.10వేలుజరిమానా



ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే రూ.10 వేల జరిమానాతో పాటు ఒక్కో సందర్భంలో జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చే అవకాశం ఉంటుంది, ఇటీవల పట్టణంలో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన ఐదుగురు వ్యక్తులకు జిల్లా న్యాయమూర్తి సమక్షంలో పదివేల రూపాయలు చొప్పున జరిమానా విధించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు బాధ్యతగా వాహన చోదకులు మసులుకోవాలి.

– కె. మురళీధర్, సీఐ, పార్వతీపురం

ఆశాజనకంగా మొక్కజొన్న



మొక్కజొన్న పంట



ఆరబెట్టిన జొన్న పిక్కలు

- ఎకరాకు 30క్వింటాళ్ల వరకు దిగుబడి

బలిజిపేట:

మండలంలో మొక్కజొన్న సాగు ఆశాజనకంగా ఉంది. రబీలో దాదాపు 2వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగుచేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది రైతులు పంటను సిద్ధం చేసి విక్రయించారు. మంచి దిగుబడులు వస్తాయనే భావనతో రైతులు రబీసీజన్‌లో ఎక్కువగా మొక్కజొన్న పంటవైపు దృష్టిసారించారు. అందుకు వ్యవసాయశాఖ అధికారులు తగు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. అన్నదాతలు ఒక్కో ఎకరాకు రూ.30వేల వరకు పెట్టుబడులు పెట్టి పండిస్తున్నారు. ఎకరాకు 30క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు అంచనా. బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.2,200 నుంచి రూ.2,600వరకు ధర పలుకుతోంది. ఈ లెక్కన ఆదాయం కూడా బాగుంటుందని చెబుతున్నారు.

పంట బాగుంది

మొక్కజొన్నతో నష్టం రాదు. రైతుకు లాభం చేకూరుతుంది. వరికంటే ఇదే ఉత్తమం. ప్రాంతాన్ని బట్టి, భూసారాన్ని బట్టి మదుపులు ఉంటాయి. ఏది ఏమైనా సులువుగా చేతికి వచ్చే పంట మొక్కజొన్న.

వెంకటరమణ, రైతు, జనార్దనపురం

సాగు సులభతరం:

ఇతర పంటల కంటే మొక్కజొన్న సాగు సులభతరం అవడంతో పాటు ఎరువులు వినియోగం కూడా తక్కువ. పంటకాలం 120రోజులు కాగా సాగుకు మూడు నుంచి నాలుగు విడతలు నీరు సరిపోతుంది. వరి పూర్తయిన తర్వాత మాగాణి భూముల్లో రెండో పంటగా మొక్కజొన్న సాగుచేసుకుంటే సులువుగా ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. వరికి ఎక్కువగా ఎరువులు వాడి ఉంటారు కాబట్టి అది మొక్కజొన్నకు కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

ప్రకృతి వ్యవసాయం విస్తరించాలి

- నాబార్డ్ డీడీఎం దినేష్‌రెడ్డి

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయం మరింత విస్తరించాలని నాబార్డ్ డీడీఎం దినేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తోటపల్లిలో జట్టు ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించేందుకు ఆయన అప్కాబ్ జనరల్ మేనేజర్లుతో కలిసి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు, జట్టు ట్రస్టీ డి.పారినాయుడుతో పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల దిగుబడి పెంపునకు, పర్యావరణ పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయ విధానం ఎంతో దోహదం చేస్తుందన్నారు. బడి నుంచి పొలంబడి కార్యక్రమాల ద్వారా ప్రజలకు ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన కల్పించాలన్నారు. సుస్థిర ఆదాయాన్ని పొందేందుకు ప్రకృతి వ్యవసాయ విధానం భవిష్యత్‌కు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో అప్కాబ్ జీఎం బివిఎస్.రాజు, శ్రీవిద్య పాల్గొన్నారు.